## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ



కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మక్తల్ సీఐ రాంలాల్, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాలను తనిఖీచేయడంతోపాటు వాహనాల నెంబర్లను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు రూ.50వేలకు పైగా నగదును తీసుకెళ్తే ఆ నగదును సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర సాయుధ బలగాలు తదితరులు పాల్గొన్నారు.

### 26న మహిళ కబడ్డీ జట్టు ఎంపిక

మరికల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో ఈ నెల 26న జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, ఫొటోతో హాజరుకావాలని కోరారు. ఎంపిన చేసిన జట్టు నిజామాబాద్ జిల్లా బుసపూర్ మండల కేంద్రంలో డిసెంబర్ 4నుంచి 6 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 9908933358, 9985523534 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### కొనసాగుతున్న ప్రచారం

మరికల్ మండలంలోని అప్పంపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

- మాగనూర్‌లో మందిపల్లికి చెందిన స్వర్గీయ ఎంపీటీసీ తనయుడు ఉమేష్ శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.
- కృష్ణామండలంలోని ఆయాగ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలుపించాలని ఓటర్లను కోరారు.
- కృష్ణాలో శుక్రవారం బీజేపీ ఎంపీటీసీ వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు.
- ఊట్కూరు మండలంలోని ఆయాగ్రామాల్లో ప్రచారం చేసి ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి సుచరిత శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు.
- కృష్ణా మండలంలోని ముడుమాల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రచారం కొసాగిస్తుండగా గ్రామానికి చెందిన మహిళలు తమకు గతకొంత కాలంగా తాగునీటి ఇబ్బందులు ఉన్న సమస్యను పరిష్కరించ లేదని ఆరోపిస్తూ ఖాళీ బిందెలతో వాహనాన్ని అడ్డుకున్నారు.
- కృష్ణాలో శుక్రవారం బీజేపీ ఎంపీటీసీ వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు.

### విజయభేరి సభను విజయవంతం చేయండి

నారాయణపేట: ఈ నెల 26వ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయభేరి సభకు టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి ఉదయం 9 గంటలకు హాజరుకానున్నరని మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తండాల నుంచి పెద్ద ఎత్తున యువత, మహిళలు, నిరుద్యోగులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి విజయభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్

మరికల్: మండలంలోని కన్మనూర్ శివారుల్లో పనులు పూర్తిచేసుకున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. నాలుగేళ్ల నుంచి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పనులు పూర్తికావొచ్చిన ప్రారంభించకపోవడంతో కన్మనూర్ పరిధిలో ఉన్న వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందక లోవొల్టేజీతో మోటర్లు కాలిపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి లోవొల్టేజీ సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

కల్వకుర్తిరూరల్: పట్టణంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడికి శుక్రవారం నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 ల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గోవిందు వరుసకు బావ అయిన ముత్యాలుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అప్పటి సీఐ సైదులు 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై నేరాభియోగ పత్రాలు కోర్టులో దాఖలు చేశారు. న్యాయమూర్తి శ్రీదేవీ నిందితుడు గోవిందుకు నాలుగు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు



మక్తల్‌లో శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మత్స్యకార సంఘం సభ్యులు

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగంబండ రిజర్వాయర్ అధ్యక్షుడు తిప్పణ్ణ, మల్లేపల్లి రమణ, శంకరప్ప, భీమప్ప, నాగరాజు, రామకృష్ణ, వెంకటేష్, నర్సింలు, శివశంకర్, గోపాల్, ఆనంద్, శంకర్‌తో పాటు మాద్వార్, ఉజ్జెల్లి, నేరడగం, సోమేశ్వర్‌బండ గ్రామాలకు చెందిన నాయకులు వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో ప్రతి ఓటరు ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిగా ఉంటానన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, నీలప్ప, రామారావు, కావలి తాయప్ప, కట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**మైనార్టీల అభ్యున్నతికి కృషి**

అమరచింత: మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్ అన్నారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు పట్టణంలోని మూడో వార్డులో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే షాదీముబారక్ పథకం కింద రూ.1,60,000 ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తౌఫిక్, అబిద్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

**సలాం భాయ్.. ఓటు మాకే..**

సలాం వాలేకూం భాయ్.. అంటూ మసీదు వద్ద టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ముస్లింలను కలిసి వాకిటి శ్రీహరిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయనను ముస్లిం కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

మరికల్: పదేళ్లు అధికారంలోకి ఉండి ఏమి చేయలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం కోసం మాయ మాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చిత్తనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్, కన్మనూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నారంరెడ్డి, రవి, కుర్మయ్య, రామకృష్ణ, విజయ్‌మోహన్‌రెడ్డి, దామోందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్: సబ్‌కా సాద్ కాంగ్రెస్ వికాస్.. కాంగ్రెస్‌కో ఓట్ దేకే వాకిటి శ్రీహరికో జితావో అంటూ కాంగ్రెస్ నాయకులు ముస్లిం ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని మస్జిద్‌ల వద్ద ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం కుమ్మక్కయి ప్రజలను మోసం చేస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం, రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, అజ్మతుల్లా, గంగాధర్, వెంకటన్న, అక్బర్, జుబేర్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కుర్ని రవికాంత్ తదితరులు ఉన్నారు.



అమరచింత జామీయా మసీదు వద్ద నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

# బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మొద్దు



వృద్ధుడితో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి

మక్తల్: బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని మక్తల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి కోరారు. మండలంలోని మాద్వార్, లింగంపల్లి, ఉప్పర్‌పల్లి, సోమేశ్వర్‌బండలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరబండకు చెందిన 50 మంది నాయకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగిరే వరకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మాదిరెడ్డి పద్మజారెడ్డి మక్తల్ పట్టణంలో జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఆశప్ప, భాస్కర్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వలింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్/అమరచింత: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమవుతుందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని కర్నాటక రాష్ట్రం కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూర్, అమరచింత బీజేపీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనకు విముక్తి కల్పిస్తామని, అవినీతితో వారు సంపాదించిన సొమ్మును కక్కిస్తామన్నారు. ఈసందర్భంగా తిప్డంపల్లికి చెందిన 30మంది బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో బెంగుళూరు ఫ్లోర్‌లీడర్ పద్మనాభరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, జిల్లా నాయకులు మరాఠి అశోక్, నరాల నారాయణ, పద్మజారెడ్డి, క్యామ భాస్కర్, హరీష్, భీంరెడ్డి, అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, రాజు, నాగేందర్‌రెడ్డి, శేషు, రఘు, రవి, కొండాపురంరాము, బాలు ఉన్నారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

# దామరగిద్దకు డిగ్రీ కళాశాల తెస్తాం



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రోడ్ షో లో నృత్యం చేస్తున్న బంజార మహిళలు



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద/మరికల్/నారాయణపేట: కారుగుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే కర్వెన నుంచి కాన్‌కుర్తి రిజర్వాయర్ నుంచి దామరగిద్దకు సాగునీరు అందించి తీరుతానని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులు, ప్రజలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు కాన్‌కుర్తిలో రోడ్ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. పక్క రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టిందుకు.. కళ్లబొల్లి మాటలతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. రైతులకు 24 విద్యుత్, ఆసరా పింఛన్స్,న్ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ధరణి వంటి పథకాలతో పాటు సాగునీరు అందాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని సూచించారు.

**ఏడాది లోపల నీళ్ల తెచ్చిస్తా**

ఎత్తైనా ప్రాంతమైన దామరగిద్దకు సాగునీరు అందించేందుకు పాలమూరు రంగారెడ్డి ద్వారా సీఎం కేసీఆర్‌తో పట్టుబట్టి కర్వెన నుంచి కాన్‌కుర్తి రిజర్వాయర్ నిర్మాణానికి నెల రోజుల క్రితం చీఫ్ ఇంజినీర్లతో కలిసి ప్రణాళిక సిద్ధం చేయించినట్లు వివరించారు. ఏడాది లోపు రిజర్వాయర్ ద్వారా దామరగిద్ద రైతులకు సాగునీరు తెచ్చిస్తానన్నారు. దామరగిద్దకు డిగ్రీ కాలేజీ తెస్తానని, ప్రస్తుతం ఉన్న పీఎచ్‌సీ ఆస్పత్రిని సీఎచ్‌సీగా మార్చి 30 పడకలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ నర్సప్ప, మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, స్థానిక సర్పంచ్ ఆశమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ సువర్ణమ్మ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, చంద్రకాంత్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌షెట్టి, శరణప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్ గెలుపును ప్రతిపక్షాలు ఏమాత్రం అడ్డుకోలేరని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. శుక్రవారం మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజేష్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన మసీదుల సమీపంలో ముస్లిం మైనార్టీల ఓటర్లను అప్యాయతంగా పలకరించారు. ఓట్లు అభ్యర్థించారు. సమావేశంలో మాట్లాడారు. ముస్లింలంతా ఏకమై తనకు మరోసారి మద్దతు తెలపాలని కోరారు. ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోకుర్తిలో 30 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

### మద్యం పట్టివేత

మల్దకల్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శుక్రవారం గద్వాల ఎక్సైజ్ ఎస్‌ఐ గోవర్ధన్ పట్టుకున్నట్లు సీఐ గోపాల్ తెలిపారు. ఎల్కూరు చెందిన బంగి రవి, హన్మంతు రెండు బైకులపై 141 క్వార్టర్ సీసాలు తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారం మేరకు రెండు బైకులకు సీజ్ చేసి మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మానవపాడు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. మండల కేంద్రంలోని వైన్స్ నుంచి అక్రమంగా రూ.83వేల విలువగల మద్యాన్ని తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుపడినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని షాబాద్ చెందిన బోయ పెద్ద నాగన్న (43)కు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఈనెల 19న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

**గుర్తు తెలియని..**

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. నలుపురంగు చొక్కా, ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

### నేడు రక్తదాన శిబిరం

కోస్గి: భగవాన్ సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శనివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా



పట్టణంలో చెత్తను సేకరించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్త బస్టాండు, రైల్వే స్టేషన్, తెలంగాణ చౌరస్తా తదితర ప్రాంతాల్లో 'స్వచ్ఛతాహీ సేవ' నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ హైదరాబాద్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే ఎలాంటి రోగాలు రావని, అందరూ ఈ దిశగా యత్నించాలన్నారు. కాగా, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సుమారు 400 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించారు. పాలమూరు యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డా.కె.ప్రవీణ, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, డా.ఎస్.ఎన్.అర్జున్‌కుమార్, డా.శివకుమార్ సింగ్, జ్ఞానేశ్వర్, గాలెన్న, ఇమ్మానియేల్, స్వాతి, శ్రీవాణి పాల్గొన్నారు.

## 80 లీటర్ల మద్యం పట్టివేత



అడ్డాకులలో పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

అడ్డాకుల: అనుమతి లేకుండా మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో మద్యం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేసినట్లు చెప్పారు. వాహనంలో వివిధ బ్రాండ్లకు చెందిన 445 క్వార్టర్ సీసాల్లో 80 లీటర్ల మద్యం ఉందని ఎస్‌ఐ తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.88వేల వరకు ఉన్నట్లు వెల్లడించారు. మద్యాన్ని తరలిస్తున్న సురేష్, డ్రైవర్ కాశన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# నందిన్నెలో వాహనాల తనిఖీ ముమ్మరం



చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ ఆదేశాల మేరకు మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా శుక్రవారం ఎక్సైజ్ సీఐ ఖలీద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లిక్కర్, మద్యం, నగదు, అక్రమ రవాణాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను పరిశీలించిన తర్వాత వాహనాలను అనుమతి ఇవ్వాలని తెలిపారు. వారి వెంట కానిస్టేబుల్ మహేష్, చక్రవర్తి, వినయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలు



ఎంఎస్‌ఎంఈ కస్టమర్ అవుట్‌రిచ్ కార్యక్రమలో పాల్గొన్న ఏజీఎం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు హైదరాబాద్ జోనల్ ఆఫీస్ సీపీసీ–హెడ్ ఏజీఎం హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రం ఎర్రసత్యం చౌరస్తా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మహబూబ్‌నగర్ బ్రాంచీలో శుక్రవారం ఎంఎస్‌ఎంఈ కస్టమర్ అవుట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఎంఎస్‌ఎంఈలు, ఎల్‌ఎల్‌ఎంఎస్‌లకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచీ మేనేజర్ సమరసింహారెడ్డి, ఖాతాదారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

# తరుగుతున్న వన సంపద




మాగనూర్‌లో కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

మాగనూర్: అనుమతులు తీసుకోరూ.. నిబంధనలు పట్టించుకోరూ.. కనిపించిన మట్టిని తవ్వేసి పచ్చని చెట్లుని కొట్టేసి బట్టీలకు తరలిస్తున్నారు. వనసంపదను తగ్గిస్తూ కాలుష్యాన్ని పెంచేస్తూ యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇలాంటి కార్యకలాపాలను కట్టడి చేయాల్సిన అధికారులు కదలట్లేదు. నిబంధనలకు విరుద్ధంగా పచ్చని చెట్లను కొట్టి ఇటుక బట్టీలకు, కట్టెలమిషన్లకు తరలిస్తున్న ఆటవీశాఖ అధికారులు మాత్రం అటుగా చూడటం లేదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలం నుంచి పదుల సంఖ్యలో కట్టేల లోడ్‌లతో ట్రాక్టర్ వెళ్తున్న ఆటవీశాఖ అధికారులు మాత్రం వాటిపై ఏటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బట్టీలపై చర్యలు తీసుకుని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వీపనగండ్ల: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ రవిప్రకాశ్ కోరారు. శుక్రవారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో సీఏపీఎఫ్ పోలీసులతో గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవిప్రకాశ్ హెచ్చరించారు.

## పత్తిమిల్లు యాజమానిపై చర్యలు తీసుకోవాలి




ఊట్కూరు పత్తి మిల్లు ముందు ధర్నా చేస్తున్న రైతులు

ఊట్కూరు: తుకంలో అక్రమాలకు పాల్పడుతున్న పత్తిమిల్లు యాజమానిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరామారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని విజయ్‌కాటన్ ఇండస్ట్రీస్ పత్తిమిల్లు ముందు రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. మిల్లు యజమానులు పత్తి తుకంలో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిడుగుర్తి గ్రామానికి చెందిన ఒక రైతు 20 క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి తీసుకురాగా 20కిలోల వ్యత్యాసం వచ్చిందని ఆయన ఆరోపించారు. ఇతర పత్తి మిల్లుల కంటే ఇక్కడ క్వింటాల్‌కు సుమారు 500 రూ.లు తక్కువగా కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. పత్తి తూకాలలో క్వింటాల్‌కు 1 కేజి వరకు తూకాలలో వ్యత్యాసం వస్తుందని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.